క్లుప్తంగా

రాజీనామా

గోవిందరావుపేట: మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి పదవికి, క్రియాశీల సభ్యత్వానికి జాలపర్తి రామారావు బుధవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీలో రోజురోజుకు చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు తనని కలవరపెడుతున్నాయి అన్నారు. మహబుబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత మండల ప్రజలకు కానీ, కార్యకర్తలకు కానీ చేసింది ఏమి లేదని, మళ్లీ ఆమె గెలుపు కోసం తాము కష్టపడలేం అని అన్నారు.

రెండు లారీలు ఢీ..



వాజేడు: మండల పరిధిలోని మండపాక వద్ద బుధవారం జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. వాజేడు వైపునకు వచ్చే దగ్గర వరంగల్ వైపు నుంచి వస్తున్న లారీని అటు వైపు నుంచే వస్తున్న మరో లారీ బలంగా ఢీ కొట్టింది. ఢీ కొట్టిన లారీ రహదారి మధ్యలో నిలిచిపోగా రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది.

పరామర్శ



గోవిందరావుపేట: మండలంలోని కోటగడ్డ గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు తుమ్మల వెంకట్ రెడ్డి, సీనియర్ పాత్రికేయుడు కృష్ణారెడ్డి తండ్రి భిక్షం రెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జిల్లా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపెల్లి రాజేందర్ పరామర్శించారు. భిక్షం రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ తదితరులు ఉన్నారు.

సీపీకి ఫిర్యాదు

శాయంపేట : ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు మారెపల్లి సునీల్‌ను దూషించిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై చర్య తీసుకోవాలని ఆ సొసైటీ బాధ్యుడు ఇందారం నాగేశ్వర్‌రావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సీపీకి ఫిర్యాదు చేశారు. పత్తిపాక, శాయంపేట తదితర గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణకు మారెపల్లి సునీల్ కృషి చేస్తున్నాడని తెలిపారు. అలాంటి వ్యక్తిపై పురుషపద జాలంతో దూషించిన హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్యాంసుందర్, పురుషోత్తం, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియామకం

పరకాల: బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా శనిగరపు రాజు నియామకం అయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

టెట్ ఫీజు తగ్గించాలి

శాయంపేట : టెట్ ఫీజును తగ్గించాలని బీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు సుమన్ బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. టెట్ పరీక్ష ఒక పేపర్ రాసే వారికి రూ.200, రెండు పేపర్లు రాసేవారికి రూ.300 ఫీజు ఉండేదని తెలిపారు. ప్రస్తుతం టెట్ దరఖాస్తు ఫీజు ఏకంగా వెయ్యి రూపాయలు పెంచడం, రెండు పేపర్లు రాసేవారికి రూ.2000 పెంచడం సరికాదని పేర్కొన్నారు. ఫీజు పెంచడంతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వృద్ధుడి ఆత్మహత్య

కాటారం: ఒంటరితనం, అనారోగ్య సమస్యతో వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఒడిపిలవంచలో బుధవారం చోటు చేసుకొంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిపిలవంచకు చెందిన పొన్న వెంకటస్వామి(70)కి నలుగురు కుమారులు శ్రీనివాస్, కుమారస్వామి, మల్లయ్య, సమ్మయ్య ఉన్నారు. వెంకటస్వామి భార్య మల్లక్క ఐదు సంవత్సరాల క్రితం మృతి చెందగా ఒంటరిగా నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇదే క్రమంలో గత ఏడాది నుంచి తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించుకుంటుండేవాడు. ఒంటరితనానికి తోడు అనారోగ్య సమస్య ఎక్కువ కావడంతో కొడుకులకు చెప్పుకోలేక జీవతంపై విరక్తి చెందిన వెంకటస్వామి ఉదయం అతడి ఇంటి వెనకగల చింతచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంకటస్వామి కుమారులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి పెద్ద కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

కొనసాగుతున్న జాతర



దోలు వాయిద్యాలతో వేల్పుల కర్రలతో గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న పూజారులు, వడ్డెలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు
- నేడు 'సుంకు పండుగ'

మంగపేట: మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీనర్సాపురంలో శ్రీ నాగులమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న జాతర కొనసాగుతోంది. ఈనెల 26 నుంచి మండె మెలుగె కార్యక్రమంతో ప్రారంభమైన జాతర ఈనెల 29తో ముగియనుంది. జాతర రెండో రోజులో భాగంగా బుధవారం ఆలయంలోని నాగులమ్మ అమ్మవారికి ఆలయ ప్రధాన పూజారి(నాగులమ్మ ఉపాసకుడు) ఆలయ ట్రస్టీ బాడిశ రామకృష్ణ స్వామి, పూజారి బాడిష నాగరమేష్ పవిత్ర గోదావరి నది జలాలు, పసుపు, కుంకుమ, తేనే పుష్పాలతో ఆదివాసీ గిరిజన సాంప్రదాయబద్ధంగా అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, ఘడి కామరాజు, ఎర్రమ్మ, కంకనాగుల గద్దెల వద్ద డోలివాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాగులమ్మ అమ్మవారి వేల్పుల కర్రలకు పూజారి మడకం లక్ష్మయ్య, వడ్డెలు జెండాలను అలంకరించి ఆలయం చుట్టు ప్రదక్షిణ నిర్వహించి గద్దెల వద్ద ఆర్తి బిడ్డలు సారికలు(డోళ్లతో) సంబురాలు నిర్వహించారు. నేటి(గురువారం) నుంచి సుంకు పండుగ(నిండు జాతర) నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, వడెడ్ల సోడి సత్యం, ముయబోయిన శివ, కుర్సం పుల్లయ్య, ఈసం సమ్మక్క, కొర్స శ్రీకాంత్, చౌళం భవాని, కట్టం సమ్మక్క, తుర్స చిన్నబ్బాయి, సోడి శ్రీను, ఇర్ప రామకృష్ణ, కొమరం ధనలక్ష్మి, పాపారావు, కుల పెద్దలు కుర్సం విష్ణుమూర్తి, మడకం రాజేశ్వరావు, కొర్స ముసలయ్య, కారం సాంబయ్య, మడకం రమేష్, కుర్సం నరేష్, తదితరులు పాల్గొన్నారు.



సంబురాలు నిర్వహిస్తున్న పూజారులు

పంటలకు సాగునీరు అందించాలి



పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

రేగొండ: కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ చేసి పంటలకు సాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రంగయ్యపల్లి గ్రామ శివారులో నీరు లేక ఎండిపోతున్న వరి పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం నీరు అందించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపిరెడ్డి, నాయకులు దగ్గు వెంకటేశ్వర్‌రావు, బండి రమేష్, పసుల అశోక్, దాట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.25 వేలు చెల్లించాలి

నీళ్లు లేక చేతికందే దశలో పంటలు ఎండిన రైతులకు పంట నష్టపరిహారం ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని ఎమ్మెల్సీ మధుసూదనచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివారులో ఎండిన పంటలను పరిశీలించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

కన్నాయిగూడెం: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక వైద్యుడు అభినవ్ అన్నారు. బుధవారం డాక్టర్ అభినవ్ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ర్యాలీ తీసి ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. దగ్గు, రక్తపు చాయలు, దగ్గినప్పుడు చాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెల్త్ సూపర్ వైజర్ రమణ కుమారి, హెల్త్ అసిస్టెంట్లు లక్ష్మణ, భాస్కర్, ఏఎన్‌ఎంలు లత, కవిత, ఆశలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మొక్కల సంరక్షణ ఏది?

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. తెలంగాణ దశాబ్ది సంపద వనాలలో భాగంగా గతంలో అధికారుల నేతృత్వంలో ఎంతో ఆర్భాటంగా మొక్కలను నాటారు. కానీ వాటికి నీరు లేక వాడిపోతున్నాయి. వాటిని పట్టించుకున్న వారే కరువయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కల రక్షణకు ఎన్నో నిధులను కేటాయిస్తుంటే సంబంధిత అధికారులు ఏం పట్టనట్లు చూస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి మొక్కలకు నీరు అందించి వాటిని రక్షించాలని కోరుతున్నారు. అలాగే మొక్కలను పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ఎండిపోతున్న మొక్కలు

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

కాటారం: పదవ తరగతి పరీక్ష రాయడానికి తండ్రి, తమ్ముడితో కలిసి బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైన విద్యార్థిని చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తోటపల్లి అక్షయ (15) ఈ నెల 19న మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పరీక్షా కేంద్రంలో పదవ తరగతి హిందీ పరీక్ష రాయడం కోసం తండ్రి ప్రవీణ్, తమ్ముడు తరుణ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై బయల్దేరింది. మార్గ మధ్యలో జాతీయ రహదారిపై కంబలపాడ్ శివారులో ప్రవీణ్ డ్రైవ్ చేస్తున్న బైక్ వర్షం కారణంగా అదుపుతప్పి పడిపోయింది. దీంతో అక్షయ బైక్‌పై నుంచి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. తరుణ్ ఎడమ కాలుకు తీవ్రగయామైంది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి గాయాలపాలైన ఇద్దరిని 108 ద్వారా చికిత్స నిమిత్తం భూపాలపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. అక్షయ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్షయ పరిస్థితి మరింత విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.



అక్షయ (ఫైల్)

రేగొండలో..

రేగొండ: స్నేహితులు మోసం చేసి తనపై దాడి జరిగేలా చేశారని మనస్తాపంతో వ్యక్తి పరుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని పోచంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రాస లెనిన్(33) మిరపకాయల బత్తాలు తొక్కడానికి స్నేహితులతో కలిసి పనికి వెళ్లి అనంతరం మద్యం సేవించడానికి స్నేహితులతో కలిసి షాపుకు వెళ్లారు. మద్యం తాగుతుండగా లెనిన్ సెల్‌ఫోన్‌ను స్నేహితులు దాచిపెట్టారు. సెల్ ఫోన్ ఎవరు తీశారని వెనకాల కూర్చున్న వారిని ప్రశ్నించగా మేము ఎమైనా దొంగలమా అంటు లెనిన్‌పై దాడి చేశారు. అనంతరం సీసీ టీవి ఫుటేజీ పరిశీలించగా మొబైల్ దాచి పెట్టిన స్నేహితులు తీసుకువచ్చి ఇచ్చారు. ఈ క్రమంలో తన తోటి స్నేహితులే మొబైల్ దాచి తనపై దాడి జరిగేలా చేశారని మనస్తాపం చెంది ఈ నెల 23న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్య శ్వేత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.



రాస లెనిన్ (ఫైల్)

ఇసుక డంపుపై దాడులు

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మండలంలోని వజినపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను లారీల్లో లోడు చేస్తుండగా పట్టుకున్నట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిసిన వివరాల ప్రకారం.. ఎస్సై సుధాకర్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా లారీల్లో అక్రమంగా ఇసుకను లోడు చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా గట్టు శ్రావణ్, ధరావత్ సురేష్, మస్న అనిల్ ఇసుకను ప్రొక్లెయినర్ సాయంతో లారీల్లో లోడు చేస్తున్నారని తెలిపారు. ఈ ముగ్గురితో పాటు మరోకరు పారిపోగా నలుగురిపై కేసు నమోదు చేసి లారీలు, ప్రొక్లెయినర్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

మద్యం స్వాధీనం

చిట్యాల: మండలంలోని వరికోల్‌పల్లి గ్రామానికి చెందిన చింతకింది తిరుపతి మద్యం అక్రమంగా అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వరికోల్‌పల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా తిరుపతి అతడి కిరాణంలో ఏలాంటి అనుమతి లేకుండా మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అందులో 6 బీర్లు, 12 ఆర్‌ఎస్ క్వాటర్ బాటిల్స్ లభించినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.3350 ఉంటుందన్నారు. అనంతరం వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అయోధ్యకు భజన మండలి సభ్యులు



తీర్థయాత్రలకు వెళ్తున్న భజన మండలి సభ్యులు

శాయంపేట : అయోధ్య బాలరాముడు, శ్రీకాశీ విశ్వేశరస్వామి సన్నిధి, త్రివేణి సంగమం యాత్రకు మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామదాసు భజన మండలి, శ్రీ వేంకటేశ్వర భజన మండలి బృందం బుధవారం బయలుదేరారు. మాందాటి రాజు, పులి ఆంజనేయులు, రాజన్న, హనుమంతక్క, రాజమణి ఉన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

మల్హర్: మండలంలోని తాడిచర్ల సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ చెప్యాల రామారావుపై ప్రవేశ పెట్టిన అవిశ్వాసం వీగి పోయింది. తాడిచర్ల సహకార సంఘం సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా ఒక డైరెక్టర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రస్తుతం 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో 7గురు డైరెక్టర్లు చెర్మన్ రామారావుపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టాలని జిల్లా సహకార సంఘం (డీసీఓ) శైలజకు ఫిబ్రవరి 29న వినతి పత్రం అందించారు. ఈమేరకు ఈనెల 26న అవిశ్వాసం ఏర్పాటు చేస్తూ డైరెక్టర్లకు నోటీసులు జారీ చేశారు. దీంట్లో భాగంగా డీసీఓ శైలజ తాడిచర్ల సహకార సంఘం కార్యాలయానికి చేరుకోగా పాలక వర్గ సభ్యులు ఎవరు కూడా హాజరు కాలేదు. కాగా అడ్మినిస్ట్రేవ్ కారణం రీత్య తీర్మాన సమావేశాన్ని బుధవారం నాటికి డీసీఓ వాయిదా వేశారు. కాగా, డీసీఓ ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. రెండవ సారి ఏర్పాటు చేసిన బలనీరుపణ కార్యక్రమానికి సైతం డైరెక్టర్లు ఎవరూ కూడా హాజరు కాలేదు. 11:30 వరకు వేచి చూసి అవిశ్వాసం సమావేశం రద్దు చేసి, అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. దీంతో చైర్మన్‌గా రామారావు తిరిగి బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ పాలక వర్గ సభ్యులు ప్రవేపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు.

అవిశ్వాసం వీగిపోవడం బీఆర్‌ఎస్ విజయమే..



సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట మధు

మల్హర్: మండలంలోని తాడిచర్ల పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావుపై పెట్టిన అవిశాస్వసం వీగిపోవడం బీఆర్‌ఎస్ పార్టీ విజయమని పెద్దపల్లి జెడ్పీచైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు అన్నారు. పీఏసీఎస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయిన సందర్భంగా తాడిచర్ల సహకార సంఘం కార్యాలయంలో బుధవారం చైర్మన్ రామారావుతో పాటు మద్దతు తెలిపిన డైరెక్టర్లను పుట్ట మధు బుధవారం శాలువాలతో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు పర్చకపోగా, ప్రజస్వామ్యన్ని ఖూనీ చేసే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. చైర్మన్‌పై అవిశ్వాసం వీగిపోవడానికి మద్దతుగా నిలిచిన డైరెక్టర్లు మల్క రాజేశ్వర్‌రావు, మాచేర్ల సురేష్, సుంకు రాము, పొట్ట రాజమ్మలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, మండల మాజీ అధ్యక్షుడు తాజోద్దిన్, ఎంపీటీసీ రావుల కల్పన మొగిళి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీ



బ్యాగులు సోదాలు చేస్తున్న ఎస్సై రమేష్



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

వాజేడు: మండలంలో బుధవారం పోలీసులు విస్తృత స్థాయి తనిఖీలను నిర్వహించారు. మండల పరిధిలోని చెరుకూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీలను చేపట్టారు. అలాగే కృష్ణాపురం గ్రామ సమీపంలో హైవేపై పేరూరు ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలను నిర్వహించారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు వాహనదారుల బ్యాగులను సోదాలు చేశారు. ముఖ్యంగా నగదు తరలింపులపై దృష్టిని కేంద్రీకరించారు. ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారు అని ఆరా తీశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామానికి చెందిన నిట్టూరి అనిల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు బుధవారం పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. పలుగుల కాంగ్రెస్ పార్టీ నాయకులు మానేం మహేష్, వడ్లకొండ సమ్మయ్య, ఒద్ది చంద్రయ్య, మచ్చ కిష్టయ్య, ఆర్‌ఎంపీ వైద్యుడు శంకర్, మచ్చ రాజయ్య, నిట్టూరి సంపత్, మంద సంతోష్, లేతకరి శంకర్, మంద వినోద్, మంద రవి, జిల్లాల సంతోష్, ముత్యాల రవి, నిట్టూరి పోచయ్య, మంద పోచయ్య, లేతకరి సుధాకర్ ఉన్నారు.



నగదు అందజేస్తున్న నాయకులు

గుడుంబా స్థావరాలపై ఉక్కుపాదం

మహాముత్తారం: అటవీ గ్రామాల్లో ఏరులై పారుతున్న గుడుంబాను అరికట్టేందుకు మండల పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గుడుంబా తయారీ, అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. మండలంలోని నిమ్మగూడెం, ప్రేమ్‌నగర్, పెగడపల్లి, గాజరాంపల్లి, కొర్లకుంట, లంబాడితండా తదితర గ్రామాల్లో గుడుంబా తయారీ కుటీర పరిశ్రమగా మారింది. మద్యం ధరలు అధికంగా ఉండటంతో రోజువారి కూలి పనులకు వెళ్లే పేద మధ్య తరగతి వారు మత్తు కోసం గుడుంబాను తాగుతున్నారు. దీన్ని అదునుగా చూసుకొని ఆయా గ్రామాల్లో కొందరు వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా గుడుంబాను తయారు చేస్తూ అమ్మకాలు కొనసాగిస్తున్నారు.



దాడులు నిర్వహిస్తున్న పోలీసులు(ఫైల్)

పోలీసుల ప్రత్యేక నిఘా..

ఇటీవల నూతనంగా మహాముత్తారం ఎస్సైగా విధుల్లో చేరిన మహేందర్‌కుమార్ గుడుంబా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని ప్రేమ్‌నగర్, పెగడపల్లి ఆయా గ్రామాల్లో ఉన్న గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తూ నియంత్రణకు కృషి చేస్తున్నారు. వారం రోజుల నుంచి వివిధ గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు చేసి తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశారు. 170 లీటర్ల గుడుంబాను సీజ్ చేసి 2వేల మూడువందల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక, పాత్రాపురం, వీరభద్రవరం, వెంకటాపురం, ఉప్పేడు, వీరాపురం గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై టాస్క్ ఫోర్సు అధికారులు ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు రాజారావు, వెంకటేశ్వర్లు, శ్రీనాథ్ అనే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో స్టేట్ టాస్క్ ఫోర్సు ఈఎస్ ప్రదీప్‌రావు, భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ రాజసమ్మయ్య, ఎస్సై బాలరాజు, భిక్షరెడ్డి, రామకృష్ణ, సిబ్బంది నవీన్, శ్రీనివాస్ గౌడ్, వీరన్న ఉన్నారు.



బెల్లం పానకం పారబోస్తున్న అధికారులు

ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలి

ఆత్మకూరు : ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీరుకుళ్ల శివారులోని శ్రీచెన్నకేశవ స్వామి ఆలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ పండితులు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భగవంతుడి అనుగ్రహం గొప్పదని అన్నారు. దైవానుగ్రహం ఉంటే అన్నిరంగాల్లో రాణించే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షులు అర్షం వరుణ్‌గాంధీ, ఉడుత రాజేందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే